అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

- చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు
- 15వ తేదీ వరకు కొనసాగనున్న వేడుకలు
- చార్మినార్‌లో రెండు రోజుల పాటు భక్తుల రద్దీ



భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

చార్మినార్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని సోమవారం పలువురు అధికార, అనధికార ప్రముఖులతో పాటు అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి భాగ్యలక్ష్మి అమ్మవారికి భక్తుల తాకిడి ఎక్కువైంది. ఆదివారం నుంచి ప్రారంభమైన అమ్మవారి దర్శనం సోమవారం కూడా కొనసాగింది. రెండు రోజుల పాటు భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి చార్మినార్ ప్రధాన రోడ్డులో బారులు తీరారు. దీపావళి పర్వదినం సందర్భంగా ఏడాదికోసారి అమ్మవారిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలుగుతాయని ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరుతారు. దక్షిణ మండలం పోలీసులు చార్మినార్ కట్టడం ప్రధాన రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

చార్మినార్‌లో సందడే సందడి..

చార్మినార్ ప్రాంతంలోని భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడంతో చార్మినార్ పరిసర ప్రాంతాలలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆదివారం తెల్లవారు జాము నుంచి ప్రారంభమైన భక్తుల పూజలు మరుసటి రోజైన సోమవారం రాత్రి వరకు కొనసాగాయి. ఈనెల 10 నుంచి ప్రారంభమైన దీపావళి వేడుకలు 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ అమ్మవారిని దర్శించుకుంటే సంవత్సరం పొడవునా భాగ్యలక్ష్మి కరుణిస్తుందని భక్తుల విశ్వాసం. దీంతో భక్తుల తాకిడి గతేడాది కంటే ఈసారి అధికంగా కనిపించింది. దాదాపు లక్షన్నర మంది భక్తులు ఈసారి అమ్మవారిని దర్శించుకున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ధంతేరస్ నుంచి ఇక్కడి అమ్మవారి గుడిని కటౌట్లతో అందంగా అలంకరించారు. మోహినీ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. పలువురు అధికార, అనధికార ప్రముఖులు అమ్మవారిని దర్శిచుకున్నారు. ఒకవైపు క్రయవిక్రయాలతో.. మరోవైపు అమ్మవారిని దర్శించుకునే భక్తులతో చార్మినార్‌లో సందడి కనిపించింది. పాతబస్తీలోని వివిధ ఆలయాలు సైతం పండుగ సందర్భంగా విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబయ్యాయి.

భాగ్యలక్ష్మి ఆలయాన్ని దర్శించుకున్న ప్రముఖులు..

దీపావళిని పురస్కరించుకొని భాగ్యలక్ష్మి అమ్మవారిని పలువురు అధికార అనధికార ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, దానం నాగేందర్, డాక్టర్ భగవాన్ రావు, మేయర్ విజయలక్ష్మి, జస్టిస్ అమర్నాథ్ గౌడ్, రామచంద్రారావు తదితరులు భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ శశికళ వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కిషన్‌రెడ్డి

గట్టి బందోబస్తు..

ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా దక్షిణ మండలం డీసీపీ పోతురాజు సాయి చైతన్య ఆధ్వర్యంలో పోలీసులు తగిన బందోబస్తును ఏర్పాటు చేసి శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఒకవైపు ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతుండడంతో వీధుల్లో నిఘా ముమ్మరం చేశారు. బంగారు ఆభరణాలతో ఆలయాలకు వెళ్లేటప్పుడు మహిళా భక్తులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక బందోబస్తులోని పోలీసులు సూచించారు.

గోషామహల్‌లో రాజాసింగ్ ఓటమి ఖాయం



జగన్‌మోహన్‌రావును సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ధన్‌రాజ్ తదితరులు

అబిడ్స్: ఈ ఎన్నికల్లో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఓటమి తప్పదని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. పదేళ్లుగా గోషామహల్‌లో ఎలాంటి అభివృద్ధి చేయని రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, అనిల్, సురేష్, ముఖేష్ ముదిరాజ్, దశరథ్, లక్ష్మణ్‌తో పాటు పలువురు నాయకులు ఆయనను కలిసి సన్మానించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ..నియోజకవర్గంలో ధూల్‌పేట్, జుమ్మేరాత్‌బజార్, బేగంబజార్, గన్‌ఫౌండ్రీ, జాంబాగ్‌లతో పాటు పలు ప్రాంతాల్లో తాను ఎక్కడికి వెళ్లినా రాజాసింగ్‌ను ప్రజలంతా విమర్శిస్తున్నారన్నారు. 25 ఏళ్లుగా నిరంతరం ప్రజా సేవచేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు విజయానికి సోపానలవుతాయన్నారు.

బీఆర్‌ఎస్‌తో అన్నివర్గాల అభ్యున్నతి



నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు సంఘీభావం తెలిపిన పలువురు మైనార్టీ మహిళలు

అబిడ్స్: అన్నివర్గాల అభ్యున్నతి సీఎం కేసీఆర్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే రికార్డు సాధించాయన్నారు. దీపావళి సందర్భంగా పలువురు మైనార్టీ మహిళలు నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని పేర్కొన్నారు. కేవలం రాజాసింగ్ సొంత పనులు చేసుకుంటూ దేశంలో తిరుగుతున్నాడే తప్పా గోషామహల్ ప్రజల అభివృద్ధి పట్టించుకోలేదన్నారు. ప్రజలంతా బీజేపీపై తీవ్రంగా వ్యతిరేకంగా ఉన్నారన్నారు. రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఈనెల 30వ తేదీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వహీద్‌తో పాటు పలువురు మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.

జంగ్ 2023 తెలంగాణ

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి



పాదయాత్ర చేస్తున్న మిత్రకృష్ణ

జియాగూడ: సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయిని కార్వాన్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ ప్రచారం చేపట్టారు. వ్యాపారస్తులను పలు మార్కెట్లలో కలిసి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు తూంకుంట అరుణ్‌కుమార్, భిక్షపతి, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, విజయ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'మజ్లిస్ ఆగడాలకు చెక్ పెడతాం'



అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ ఆగడాలు చెక్ పెడతామని కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనను స్థానికులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మజ్లిస్ ఆగడాలు బాగా పెరిగిపోయాయని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుండాలుగా మారి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగాలంటే తనను గెలిపించాలని ఆయన కోరారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన అన్నారు.

'చార్మినార్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం'

చార్మినార్: ఈసారి చార్మినార్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కే.ఎస్.ఆనంద్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చార్మినార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ సోమవారం గౌలిపురాలోని కే.ఎస్.ఆనంద్‌రావు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్‌తో కలిసి ఆయన ముజీబుల్లా షరీఫ్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ గాలివీస్తోందన్నారు.



మహ్మద్ ముజీబుల్లా షరీఫ్‌ను సన్మానిస్తున్న కే.ఎస్. ఆనంద్‌రావు, కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్

'రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



మధుయాష్కీగౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. సోమవారం ఆయనను తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్‌ను జైకొట్టే వారికే ప్రాధాన్యం ఇస్తుందని ఆరోపించారు. ఎరుకల అభివృద్ధికి, వారి పిల్లల చదువు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎటువంటి ప్రణాళిక అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎరుకల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కెంబసారం కృష్ణ, కురాకుల కృష్ణ, నాయకులు కె.రవి, కృష్ణ, కె.పాండు, బి.జైపాల్, సత్యనారాయణ తదితరులున్నారు.

'అన్ని వర్గాల ప్రజల మద్దతు మా పార్టీకే'



మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ

చార్మినార్: అన్ని వర్గాల ప్రజల మద్దతు మా పార్టీకే ఉందని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ అధికార ప్రతినిధి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ ధీమా వ్యక్తం చేశారు. మొగల్‌పురాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పోటీ అభ్యర్థుల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ముస్లిం ప్రజలను కొంత కాలంగా మజ్లిస్ పార్టీ మోసం చేస్తోందన్నారు. యాకుత్‌పురా, రాజేంద్రనగర్, బహదూర్‌పురా, చారిమ్నార్, కామారెడ్డి, బోధన్, మహేశ్వరం, మలక్‌పేట్, గోషామహల్ తదితర 9 నియోజకవర్గాలలో తమ పార్టీ అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారన్నారు.

'ఈసారి బీజేపీదే అధికారం'



సంరెడ్డి సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: ఈసారి ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు ఆశించిన ఫలితాలు సాధిస్తుండడంతో రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి అన్నారు. మలక్‌పేట్ బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పాతబస్తీలోని ముస్లిం మైనార్టీ ఓట్లు సైతం ఈసారి బీజేపీకి పడుతున్నాయన్నారు.

నామినేషన్ల తిరస్కరణ

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో నాలుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించడం జరిగిందని రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యప్రకాష్ తెలిపారు. మజ్లిస్ పార్టీ తరపున నామినేషన్ వేసిన అక్బరుద్దీన్ ఒవైసీ కుమారుడు నూరుద్దీన్ ఒవైసీ, స్వతంత్ర అభ్యర్థులు జె.నవీన్ కుమార్, మహ్మద్ హామెద్ సిద్దిఖీ, జి.వేణు కుమార్‌ల నామినేషన్లలో పొరపాట్లు ఉండడంతో తిరస్కరణకు గురయ్యాయన్నారు. ప్రస్తుతం బరిలో 17 మంది ఉన్నారని తెలిపారు.

బహదూర్‌పురాలో నాలుగు..

బహదూర్‌పురా: బహదూర్‌పురాలో నాలుగు నామినేషన్లను తిరస్కరించడం జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దశరథ్ సింగ్ తెలిపారు. మొత్తం 16 నామినేషన్లు దాఖలు కాగా.. స్క్రూటినీలో నాలుగు తిరస్కరించబడ్డాయన్నారు. అందులో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ప్రసన్న కుమారి బీ-ఫారం సమర్పించలేదన్నారు. అంతే కాకుండా దేశ్ జనహిత్ పార్టీ అభ్యర్థి మహ్మద్ షకీల్, మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు మహ్మద్ సిరాజ్ ఖాన్, గుంటి వివేకనందలు నామినేషన్‌లో సరైన పత్రాలు లేనందున తిరస్కరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. స్క్రూటినీ అనంతరం 12 మంది బరిలో ఉన్నారన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సతీష్‌కుమార్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకుడు సతీష్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, గోషామహల్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతారావు ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో దివంగత మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ అనుచరుడిగా, పీఏగా సతీష్‌కుమార్ 20 ఏళ్లకు పైగా పనిచేశాడు. కొన్ని నెలల క్రితం బీఆర్‌ఎస్‌లో చేరిన సతీష్‌కుమార్ తిరిగి కాంగ్రెస్ గూటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గోషామహల్‌లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు.



మాణిక్‌రావు ఠాక్రే, సునీతారావుల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన సతీష్‌కుమార్

'జూబ్లీహిల్స్‌లో విజయం సాధిస్తాం'



రాషేద్ ఫరాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: జూబ్లీహిల్స్‌లో విజయం సాధిస్తామని మజ్లిస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థి, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫరాజ్ అన్నారు. సోమవారం ఆయన షేక్‌పేట్‌లోని పలు కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా గుల్షన్ కాలనీలో ఆయనను ఘనంగా సన్మానించారు. మజ్లిస్ సెక్యులర్ పార్టీగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు. షేక్‌పేట్ కార్పొరేటర్‌గా ఉంటూ తాను ఎన్నో అభివృద్ధి పనులు చేయించానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ముస్తాఫా, విఠల్‌గౌడ్, నర్సింహ్మా, మహ్మద్ తదితరులున్నారు.

ప్రజలకు అందుబాటులో మజ్లిస్ పార్టీ



ప్రచారంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, నియాజ్

గోల్కొండ: ప్రజలందరికీ అందుబాటులో ఉండే పార్టీ మజ్లిస్ ఒక్కటే అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నానల్‌నగర్ డివిజన్‌లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేయించామన్నారు. ప్రజలకు అవసరమైన పనులు చేసిపెట్టడమే మజ్లిస్ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తనను ఈసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, డాక్టర్ నియాజ్ అహ్మద్‌ఖాన్, నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

గోషామహల్‌లో కాంగ్రెస్, బీజేపీలకే పోటీ



హనుమాన్‌టేక్డీలో ఓట్లను అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సునితారావు

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీకే పోటీ అని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సునీతారావు అన్నారు. సోమవారం సాయంత్రం నియోజకవర్గంలోని హనుమాన్‌టేక్డీలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా రాజాసింగ్ ఎమ్మెల్యేగా ఎలాంటి అభివృద్ధి చేసిందిలేదన్నారు. హిందూ ధర్మం పేరిట పబ్బం గడుపుతూ కోట్ల రూపాయాలు దండుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు పూర్తి వ్యతిరేకత ఉందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటున్నారని, తన విజయం సునాయసమన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు ఉద్యమకారుల కృషి



ఉద్యమకారులతో సమావేశమైన నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపించేందుకు ఉద్యమకారులు కృషి చేస్తామని తెలంగాణ ఉద్యమకారులు, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు న్యాయవాది రాజశేఖర్, శంకర్‌లాల్‌యాదవ్, యాదగిరి పేర్కొన్నారు. ఉద్యమకారులతో సోమవారం నందకిశోర్‌వ్యాస్ బిలాల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారుల అడ్డా అని పేర్కొన్నారు. తెలంగాణ వాదులు, ఉద్యమకారులు ఏకమై నందకిశోర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. నందకిశోర్‌వ్యాస్ మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే అందరికీ అండగా ఉండి ప్రజా అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో వినోద్ యాదవ్, దత్తు, రమేష్‌గుప్తా, రూప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వీకుల సమాధుల వద్ద దీపావళి సందడి



ఎర్రకుంట శ్మశాన వాటికలో..

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లోని హిందూ శ్మశాన వాటికలు సోమవారం రాత్రి దీపావళి సందడితో కళకళలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు తమ సమయానుకూలంగా పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి పూలు, పండ్లు, దీపాలు ఏర్పాటు చేసి వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ శ్రద్ధాంజలి ఘటించారు. దీపావళి సందర్భంగా కొంతమంది తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి దీపావళి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. చెత్తాచెదారంతో ఉండే శ్మశాన వాటికలలోని సమాధులు దీపావళి సందర్భంగా క్లీన్‌గా కనిపించాయి. జోనల్ కమిషనర్ వెంకన్న ఆదేశాల మేరకు హిందూ శ్మశాన వాటికల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. వీధిదీపాలతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఏడాది పొడవునా చెత్తాచెదారంతో కనిపించే శ్మశాన వాటికలు శుభ్రంగా కనిపించాయి.

దీపావళి సందడి

దీపావళి సందర్భంగా యువకులు, చిన్నారులు ఉత్సాహంగా టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారులంతా ఓ చోట చేరి బాణాసంచాలు కాలుస్తూ దీపావళి శుభాకాంక్షలు చెప్పకున్నారు. -సాక్షి, సిటీబ్యూరో



పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహిత్య కళాపీఠం 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ..వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి వారికి పురస్కారాలను ఇవ్వడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా రచయిత ఈటల సమ్మన్న రచించిన సత్యదర్శనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు సంపాదకులు పత్తిపాక మోహన్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, నేటినిజం పత్రికా సంపాదకులు బైస దేవదాస్, కళాపీఠం వ్యవస్థాపకులు చిక్కా రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

గౌలిపురా: అమావాస్యను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో గౌలిపురా బతుకమ్మ సమీపంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు చీల రాములుగుప్తా, అధ్యక్షుడు శ్రీధర మల్లికార్జున్ గుప్తా, ప్రధాన కార్యదర్శి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతి తిదతరులు పాల్గొన్నారు.

సంగం ఆలయంలో లక్ష్మీ పూజ



సంగం ఆలయంలో లక్ష్మీ పూజలో రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: సంగం ఆలయంలో దీపావళి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీపావళి పురస్కరించుకొని ఆలయంలోని లక్ష్మీ దేవికి పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా 10 వేల దీపాలతో ఆలయాన్ని భక్తులు అలంకరించారు. రంగురంగుల పూలతో వివిధ ఆకృతులను చేసి, బొమ్మల కొలువు, దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్



సంతోష్‌నగర్: ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి సూచించారు. ఎన్నికలను పురస్కరించుకొని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్, సీ-బ్లాక్, హెచ్-బ్లాక్, బీ-బ్లాక్ తదితర ప్రాంతాల్లో సిటీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, కంచన్‌బాగ్ పోలీసులతో ఫ్లాగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..ప్రజలకు తాము ఉన్నామంటూ భరోసా కల్పించేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్‌లను నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా నిర్భయంగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. రౌడీషీటర్లు ఎన్నికల సమయంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూదన్నారు.

హోమియోపతికి ఉజ్వల భవిష్యత్తు



హోమియోపతి ఉత్పత్తులను విడుదల చేస్తున్న డాక్టర్ క్రిస్టోఫర్

గన్‌ఫౌండ్రీ: దేశవ్యాప్తంగా హోమియోపతికి మంచి ఆదరణ లభిస్తుందని సాగర్ హోమియో డైరెక్టర్ డాక్టర్ క్రిస్టోఫర్ జుల్లింగ్ తెలిపారు. సోమవారం అబిడ్స్‌లో సాగర్ హోమియో బ్రాంచిలో నూతన ఔషధాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో హోమియోపతికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తమ శాఖలను విస్తరిస్తున్నారన్నారు. స్విజర్లాండ్ నుంచి హెర్బామెడ్ పేరుతో నూతన ఉత్పత్తులను నగరవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సాగర్ హోమియో అబిడ్స్ బ్రాంచి యజ మాని డాక్టర్ మీర్ హైదర్ అలీ, ఫరూఖ్‌అలీ, సిద్దీఖ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

రెండు వేర్వేరు ప్రాంతాల్లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన షోరూమ్ రెండో అంతస్తు

గౌలిపురా: షార్ట్ సర్క్యూట్‌తో బజార్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో అగ్నిప్రమాదం సోమవారం తెల్లవారు జామున మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..లాల్‌దర్వాజాలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో సోమవారం తెల్లవారుజామున ఆకస్మాతుగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో రెండో అంతస్తులోని వాషింగ్ మెషీన్, ఫ్రీజ్, ల్యాప్‌టాప్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో షోరూమ్ కిందిభాగంలో ఉన్న కిరణ్ డయాగ్నోస్టిక్ సెంటర్ స్వల్పంగా ధ్వంసమైంది. దీనిపై నిర్వాహకుడు తమకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

దబీర్‌పురా: మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..పత్తర్‌గట్టిలో ఫుట్‌వేర్‌కు చెందిన దాదాపు 15 షట్టర్లు కొనసాగుతున్నాయి. బబ్లూ సింగ్‌కు చెందిన నాలుగు ఆనంద్ ఫుట్‌వేర్ షాపులు, కిరణ్‌కు చెందిన రెండు ఆర్.కె.చెప్పల్ షాపులు, మహ్మద్ సోహేబ్‌కు చెందిన నాలుగు సఫారీ షూ షాపులు కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం ఈ ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మొత్తం 10 షాపుల్లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో చెప్పుల తయారీకి వినియోగించే వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.